


కల్వకుంట్ల కవిత జైలుకు

మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి సంచలన వ్యాఖ్యలు

ప్రజాశక్తి- తిరుమల: దేశంలోనే అతిపెద్ద డిపాజిట్లు కలిగిన రాజకీయ పార్టీగా భారాస (భారత్ రాష్ట్ర సమితి) నెలకొల్పబడిందని, తెలంగాణ రాష్ట్ర ఖజానాను దోచుకొని కేసీఆర్ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మాజీ పెద్దపల్లి ఎంపీ వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. సోమవారం వీఐపీ ప్రారంభ విరామదర్శన సమయంలో ఆయన కుటుంబసమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పైన ఉన్న వ్యతిరేకత కోసమే భారాస పార్టీ స్థాపించారని, ఆ వ్యతిరేకతను మళ్ళించేందుకే తెలంగాణలో సంపాదించిన సొమ్మును కేసీఆర్ ఖర్చు చేస్తున్నారన్నారు. మద్యం కుంభకోణంలో జైలుకు వెళ్లిన మనీష్ సుసోడియా తరహాలోనే కవిత కూడా జైలుకు వెళ్ళుతుందని ఆయన తెలిపారు. అలాగే తిరుమల శ్రీవారిని టీంఇండియా మహిళ జట్టు సభ్యురాలు ప్రణవి చంద్ర కూడా దర్శించుకున్నారు.

రేణిగుంటలో భారీ అగ్ని ప్రమాదం

- ఫాక్స్‌లింక్ కంపెనీకి రూ.20 కోట్లు ఆస్తి నష్టం - షార్ట్‌సర్క్యూట్ కారణమంటున్న పోలీసులు

ప్రజాశక్తి- రేణిగుంట

తిరుపతి జిల్లా రేణిగుంట పారిశ్రామిక వాడలోని ఫాక్స్ లింక్ పరిశ్రమలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పరిశ్రమలోని మొదటి అంతస్థులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వేగంగా మంటలు వ్యాప్తి చెందడంతో దట్టమైన పొగ భవనం మొత్తం విస్తిరింది. మంటలు వేగంగా వ్యాప్తి చెందడంతో ఒక్కసారిగా పరిశ్రమ నుంచి ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. డేటా కేబుల్ తయారీ పరిశ్రమ కావడంతో మరింత వేగంగా మంటలు చెలరేగాయి. సెక్యూరిటీ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మూడు అగ్నిమాపక వాహనాలతో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. మొదటిఅంతస్థు పూర్తిగా దగ్ధం కాగా మిగిలిన అంతస్థులన్నీ పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా, వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అగ్ని ప్రమాదంలో రూ. 20కోట్ల రూపాయల ఆస్తి దగ్ధం అయినట్లు యాజమాన్యం, అధికారులు అంచనా వేశారు. అగ్నిప్రమాదం సమయంలో ఫ్యాక్టరీలో 200 మందికీ పైగా సిబ్బంది పనిచేస్తున్నారు. భోజన విరామ సమయం కావడం వలన ప్రాణనష్టం తప్పింది. మంటలు చెలరేగడంతో మంటలను అదుపు చేసేందుకు సిబ్బంది ప్రయత్నించారు. ఫ్యాక్టరీ సెక్యూరిటీ మంటలు అదుపులోకి రాకపోవడంతో సిబ్బందిని బయటికి పంపించేశారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం జరిగింది. ప్రాణనష్టం సంభవించలేదని ఫ్యాక్టరీ యాజమాన్యం తెలిపింది. అగ్ని ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమని పోలీసులు భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి రేణిగుంట, ఏర్పేడు మండలాల పోలీసులు చేరుకుని పరిశీలించారు. అలాగే ఇండస్ట్రియల్ హబ్ సీఈఓ గౌతమ్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై యాజమాన్యంతో మాట్లాడారు.



ఫ్యాక్టరీ నుంచి ఎగసిపడుతున్న మంటలు



పూర్తిగా కాలిపోయిన లోపలి భాగం

ప్రశాంత వాతావరణంలో పోలింగ్

పటిష్టమైన బందోబస్తు ప్రణాళిక సిద్ధం కావాలి

నిర్వహణకు ఎన్నికల యంత్రాంగం సన్నద్ధం కావాలి : కలెక్టర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట రమణారెడ్డి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఉపాధ్యాయుల, పట్టభద్రుల నియోజకవర్గాల ఎంఎల్‌సి ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రకాల చర్యలు చేపట్టాలని, అత్యంత ప్రణాళిక బద్ధంగా బందోబస్తు ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.వెంకట రమణరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం కలెక్టర్ ఎస్పీ పరమేశ్వరరెడ్డి, సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్‌ఓ శ్రీనివాసరావుతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు ఎస్పీలు, ఆర్డీఓలు, డిఎస్పీలు, తహశీల్దార్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు బందోబస్తు ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని, ఎన్నికల ప్రక్రియలో అధికారులు భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలు మేరకు పనిచేయాల్సి ఉంటుందని కమిషన్ జారీ చేసిన నిబంధనలపై చక్కటి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సికు సంబంధించి అనుబంధ పోలింగ్ కేంద్రాలతో కలిపి 101 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 23న ప్రచురించిన ఓటర్ల జాబితా మేరకు 86941 ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 53435 మంది, మహిళలు 33494, ఇతరులు 12 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు 7 ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు ఏర్పాటు చేసి పర్యవేక్షణకు చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 23 సెక్టార్లు ఏర్పాటు చేసి రూట్ ఆఫీసర్లను నియమించి 138 పోలింగ్ కేంద్రాలకు అనుసంధానం చేశామని అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి 15మంది నోడల్ అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని పోలీస్ రెవెన్యూ అధికారులు సమన్వయంతో పోలింగ్ కేంద్రాలలో ఉన్న వాస్తవిక పరిస్థితులు గమనించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. సమస్యలు లేని పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటికి అనుగుణంగా బందోబస్తు ప్రణాళిక చాలా పటిష్టంగా ఏర్పాటు కావాలని అన్నారు. అలాగే తిరుపతి డివిజన్ నందు 23 పోలింగ్ స్థానాలు గూడూరు డివిజన్‌లో 9 పోలింగ్ స్థానాలు శ్రీకాళహస్తి డివిజన్‌లో 10 పోలింగ్ స్థానాలు సూళ్లూరుపేట డివిజన్ 9పోలింగ్ స్థానాలలో గల పోలింగ్ కేంద్రాలలో అలాంటి కేంద్రాలను గుర్తించిన మేరకు ప్రణాళికల తయారీ, బలగాల మోహరింపుకు చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. బిఎల్‌ఓలు ఓటర్ల స్లిప్పులు సదరు ఓటరుకు అందేలా చూడాలని దానికి అనుగుణంగా సంబంధిత బిఎల్‌ఓలకు ఉత్తర్వులు తహశీల్దార్లు జారీచేసి బాధ్యతలు కేటాయించాలన్నారు. ఎస్పీ వివరిస్తూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని 23 రూట్లకు గాను 31 మొబైల్ టీంలు ఏర్పాటు చేస్తున్నామని, 24 స్ట్రైకింగ్ బలగాలు, 7 ప్రత్యేక స్ట్రైకింగ్ బలగాలు, 4 స్వాట్ టీమ్‌లు ఏర్పాటు, తగినన్ని క్యూఆర్టిల ఏర్పాటు, బ్యాలెట్ రవాణా డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాల వద్ద తగినంత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పూర్తిస్థాయిలో బందోబస్తు ప్రణాళిక రెండు రోజుల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవోలు కనక నరసారెడ్డి, రామారావు, చంద్రముని, రనాల్ కిరణ్ కుమార్, అదనపు ఎస్పీలు కులశేఖర్, వెంకటరావు, చెన్నయ్య, రెవెన్యూ పోలీసు అధికారులు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష, కార్యదర్శులుగా రాజశేఖర్, ముత్యాల రెడ్డి



ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: తిరుపతి జిల్లా యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో ఆదివారం యూటీఎఫ్ తిరుపతి జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సమావేశాల్లో రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు సమక్షంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షులుగా కే.శేఖర్, అధ్యక్షుడిగా జిజే.రాజశేఖర్, సహాధ్యక్షులుగా కెఎస్‌బి. సూర్యప్రకాష్, కె.శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా కె.ముత్యాల రెడ్డి, కోశాధికారిగా పి.రమేష్ నాయుడును ఎన్నుకున్నారు. అదేవిధంగా జిల్లా కార్యదర్శులుగా దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్‌రెడ్డి, ఎన్.శేఖర్, జి.శ్రీనివాసులు, ఏ.పద్మజ, ఏ.హరిబాబు, ఐ.మస్తానయ్య, జి.సుధీర్, కె.ప్రభాకర్, ఎం.కుమారస్వామి, డి.నిర్మల, కె.మోహన్ బాబు, సి.సురేష్‌లను ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర కౌన్సిలర్లుగా కే.ముత్యాల రెడ్డి, జిజే.రాజశేఖర్, రామమూర్తి రాజు, బి.రమేష్, పి.వాసుదేవరావు, కె.ఉదయకుమార్, ఎం.జయంతి, విజయశ్రీ, జిల్లా ఆడిట్‌కమిటీ కన్వీనర్‌గా వెంకటకష్ణ తదితరులను ఎన్నుకున్నారు. యుటిఎఫ్ లక్ష్యాల కోసం నూతన కమిటీ పాటుపడాలని రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.


తిరుపతి ప్రజలపై 22ఏ పేరుతో

టిటిడి వేధింపులను మానుకోవాలి

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: తిరుపతి నగరంలో తరతరాలుగా నివాసముంటున్న వారి స్థలాల క్రయ,విక్రయాలను నిలుపుదల చేస్తూ, రిజిస్ట్రేషన్లు ఆపివేస్తూ చేసిన నిర్ణయం అన్యాయమైందని తక్షణం దీనిని ఉపసంహరించుకోకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని సిపిఎం తిరుపతి నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కారంకై ఈనెల 28వ తేదీ మంగళవారం నాడు తిరుపతి బస్టాండ్ సమీపంలోని రామతులసీ కళ్యాణ మండపంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని బాధితులతోపాటు అన్ని రాజకీయపక్షాలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరుపతి నగరంలోని 22ఎ బాధిత ప్రజలు ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి తరలిరావాలని కోరారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పరిపాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని, ఇది అత్యంత అమానుషమైందని అన్నారు. తిరుపతి నగర ప్రజలను వివిధ రూపాల్లో వేధింపులు గురిచేస్తున్న ప్రభుత్వం తాజాగా రిజిస్ట్రేషన్ల నిషేధం పేరుతో అన్యాయంగా ప్రవర్తిస్తుందని తీవ్రంగా విమర్శించారు.

రైల్వే సేవలు సంతృప్తినిచ్చింది: కె.చంద్రమౌళి



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: 36 సంవత్సరాల పాటు కేంద్ర రైల్వే విభాగంలో చేసిన సేవలు సంతృప్తినిచ్చిందని సిఆర్ఎస్ సిబిఆర్ సెక్షన్ సీనియర్ టెక్నిషియన్ కాళహస్తి చంద్రమౌళి తెలిపారు. ఈనెల 28వ తేదీన పదవీ విరమణ చేయనున్న ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మునిలక్ష్మమ్మ, జయరామయ్య దంపతులకు మొదటి సంతానంగా జన్మించాను. నాతోపాటు మా సోదరి శకుంతల కూడా ఉంది. తిరుపతి అర్బన్ శెట్టిపల్లి గ్రామంలోనే 7వ తరగతి వరకు చదువుకున్నాను. అనంతరం హైస్కూల్ విద్యాభ్యాసం రేణిగుంటలో, ఐటిఐ తిరుపతిలో పూర్తిచేశాను. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకొని జీవనోపాధి సాగించే వారు. కుటుంబంలో పెద్ద కొడుకుగా కుంటుంబ ఆర్థికపరిస్థితి మాపై పడింది. దానితో చదువును నిలిపివేశాను. కుటుంబ పోషణకోసం వ్యవసాయ పనులు చేసుకుంటూ కాలం గడిపాను. 1983లో తులసమ్మతో నాకు వివాహం అయింది. మాకు సాగర్‌కుమార్ (పేఅండ్ అకౌంట్స్ సీనియర్ ఆఫీషర్) కుమారుడు, కోడలు లావణ్య కోర్టు టెక్నిషన్‌గా, కుమార్తె హిమబిందు టైపిస్టుగా విధులు నిర్వహిస్తోంది. అల్లుడు కేథరనాథ్ రేణిగుంట పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. మా గ్రామానికి సమీపంలో సిఆర్ఎస్ వర్క్‌షాపు ఏర్పడడంతో, ఆ సంస్థ ఏర్పాటుకు తమ వ్యవసాయ భూములు ఇవ్వడంతో తమకు ఉపాధిగా రైల్వేలో ఉద్యోగం అవకాశాన్ని 1987లో కల్పించారు. అప్పటికే టెక్నిషియన్‌గా ఐటిఐ పూర్తి చేయడంతో తన విద్యార్హతను పట్టి, గ్రామానికి సమీపంలో ఉన్న సిఆర్ఎస్‌లోనే ఉద్యోగం ఇచ్చారు. అప్పటి నుంచి వివిధ హోదాలో పనిచేస్తూ సీనియర్ టెక్నిషియన్‌గా పదవీవిరమణ చేస్తున్నారు. ఇన్ని రోజులు నా విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, తోటి ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రత్యేకించి నా కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు. పదవీవిరమణ అనంతరం శెట్టిపల్లి అభివృద్ధికి, నా ఊరి ప్రజల ఉన్నతికి కృషి చేస్తానని వెల్లడించారు.

శాసన మండలి ఎన్నికలకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం

పంపిణీకి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయండి: కమిషనర్




ప్రజాశక్తి- తిరుపతిటౌన్: తిరుపతి నియోజకవర్గ పరిధిలో జరగనున్న శాసనమండలి ఎన్నికలను సంబంధించి బ్యాలెట్ బాక్సులను పూర్తిస్థాయిలో సిద్ధం చేశామని నగరపాలక సంస్థ కమిషనర్, ఎన్నికల నిర్వహణాధికారి అనుపమ అంజలి తెలిపారు. అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో సిద్ధం చేస్తున్న బ్యాలెట్ బాక్సులను, ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయనున్న తిరుపతి శ్రీపద్మావతి డిగ్రీ కళాశాలలోని పిజి బ్లాక్‌ను సోమవారం ఎన్నికల అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్చి 13న నిర్వహించే శాసన మండలి ఎన్నికలకు సంబంధించి తిరుపతి నియోజకవర్గ పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటర్లకు 25, టీచర్లకు 4 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో వినియోగించేందుకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామన్నారు. ఎన్నికలకు అవసరమైన సామాగ్రిని పంపిణీ చేసేందుకు, బ్యాలెట్ బాక్సులు భద్రపరిచేందుకు గదులను సిద్ధం చేస్తున్నామన్నారు. బ్యాలెట్ బాక్సులు ఉంచే గదుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలింగ్ ముందు రోజు ఎన్నికలకు సంబంధిత ఎన్నికల అధికారులకు, సిబ్బందికి అందించే సామాగ్రి పక్కాగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులకు, సహాయ సిబ్బందికి భోజన ఏర్పాట్లు చేయాలన్నారు. సామాగ్రి తీసుకెళ్లేందుకు వాహన సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. కమిషనర్ వెంట తహశీల్దార్ వెంకటరమణ, డెప్యూటీ తహశీల్దార్ జీవన్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎన్నార్‌ై విద్యాసంస్థల వార్షికోత్సవం

నాణ్యమైన విద్యను అందించడమే మా ధ్యేయం

కళాశాల సీఈవో, డైరెక్టర్ విద్యాసాగర్



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: స్థానిక మహతి ఆడిటోరియంలో సోమవారం ఎన్నార్‌ై పాఠశాలలు, కళాశాలల వార్షికోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల సీఈవో, డైరెక్టర్ విద్యాసాగర్ పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పుడు నుంచే భక్తిశ్రద్ధలతో విద్యను అభ్యసించాలని ప్రతిఒక్క విద్యార్థి ఉన్నత చదువులు చదివి గొప్పస్థాయిలో ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు. వారికి నాణ్యమైనవిద్యను అందించడమే ధ్యేయంగా తమ విద్యాసంస్థను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్కూల్లోని విద్యార్థులు విద్యలోనే కాక క్రీడలోను ముందు ఉండడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతిఒక్క విద్యార్థికి ఉన్నత విద్యను అందించి మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు కషి చేస్తామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య అందరికీ అందించాలని లక్ష్యంతో ఎన్నార్‌ైనీ స్థాపించినట్లు తెలిపారు. విద్యార్థులను ఒకరితోఒకరిని పోల్చకూడదని కలను ఆస్వాదించే స్వాతంత్రం ఇవ్వాలని అన్నారు. పిల్లలను ఒత్తిడికి గురి చేయకుండా విద్యను అందించాలనేదే ముఖ్యలక్ష్యమన్నారు. అలాగే కళాశాలలో ఉన్న విద్యార్థులకు మంచి విలువలను నేర్పిస్తున్నామని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షల సమయంలో ఆరోగ్యంగా ఉండాలి అందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటూ పరీక్షలకు సిద్ధంగా ఉండాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన తల్లిదండ్రులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తదితర బందానికి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్స్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిది లంచగొండి ప్రభుత్వం

తొండవాడలో నారా లోకేష్

సమస్యలను ఏకరువు పెట్టిన మీసేవ మిత్రులు



అంగడిలో టీ తాగుతున్న లోకేష్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: చంద్రగిరి మండలం శివగిరి విడిది కేంద్రం నుంచి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్ యువగళం పాదయాత్రను 29వ రోజు సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభించారు. తొండవాడలో నారా లోకేష్ యువగళం పాదయాత్రకు మీసేవ మిత్రులు సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా వారి సమస్యలను లోకేష్‌కు తెలిపారు. ప్రభుత్వపథకాలను ప్రజలకు అందించడంలో నాణ్యమైన, మెరుగైన సేవలందించేందుకు వారి వంతు కషిచేస్తున్నట్లు తెలిపారు. ఫలితంగా గత ప్రభుత్వంలో తమకు ఎన్నో అవార్డులు వచ్చాయని, రాష్ట్రంలో తాము అందించిన సేవలను మోడల్‌గా తీసుకొని తమిళనాడులో ఈ-సేవ, కర్నాటకలో బెంగుళూరు ప్లస్ పేరుతో మీసేవ విధానాన్ని అమలులోకి తెచ్చారని తెలిపారు. అయితే రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం మీసేవలను పూర్తిగా చంపేసిందని, ప్రజలను మళ్లీ కార్యాలయాల చుట్టూ తిప్పుకునే విధానానికి తెరలేపుతోందని అన్నారు. దీనివల్ల ప్రజలు ఇబ్బందుల పాలుకావడమేగాక వివిధ పత్రాల కోసం లంచాలు సమర్పించుకుంటే కానీ పని జరగని పరిస్థితులు నెలకొన్నాయని, టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీసేవ విధానాన్ని సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలందించేలా కషిచేయాలని కోరారు. నారా లోకేష్ స్పందిస్తూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమే ఒక లంచగొండి ప్రభుత్వమని, ఆన్‌లైన్ విధానం ద్వారా తమ ఆటలు సాగవనే ఉద్దేశంతో మీసేవలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక, మద్యం అమ్మకాల్లో నగదు చెల్లింపుల విధానం ద్వారా వేలకోట్ల రూపాయల దోపిడీకి తెరలేపారని అన్నారు. ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు ప్రజలను అడ్డంగా దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. టిడిపి ప్రభుత్వ హయాంలో మీసేవల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించడంతోపాటు వేలాది నిరుద్యోగులకు ఉపాధి కల్పించామని, టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీసేలను మరింత పటిష్టం చేసి పథకాల అమలు, వివిధరకాల సర్టిఫికేట్ల జారీలో జాప్యాన్ని నివారిస్తామని పేర్కొన్నారు. 28వ రోజు ఆదివారం 13.2 కిలోమీటర్లు నడిచారు. మొత్తంగా ఇప్పటి వరకు 367.2 కిలోమీటర్లు నడిచారు. సోమవారం ఉదయం 8 గంటలకు శివగిరి విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. 9.15 గంలకు శానంబట్ల గ్రామంలో స్థానికులతో మాటామంతీ నిర్వహించారు. అనంతరం 10.20 గంటలకు పిచ్చినాయుడుపల్లిలో ఎస్సీ సామాజిక వర్గీయులతో సమావేశమై వారిలో మాట్లాడారు. 10.45 గంటలకు తొండవాడ బహిరంగసభలో మాట్లాడారు. 11.45 గంటలకు తొండవాడలో భోజన విరామం తీసుకున్నారు. అనంతరం 12.45 గంటలకు భోజనవిరామ ప్రాంతంలో స్థానికనేతలతో అంతర్గత సమావేశం నిర్వహించారు. సాయంత్రం 3 గంటలకు తొండవాడ నుంచి పాదయాత్ర కొనసాగించారు. 4.30గంటలకు చంద్రగిరి టవర్‌క్లాక్ జంక్షన్‌లో స్థానికులతో మాటామంతీ, 5.05 గంటలకు చంద్రగిరి నూర్ జంక్షన్‌లో స్థానికులతో భేటీ అయ్యారు. 6.55 గంటలకు ఇత్తెపల్లిలో స్థానికులతో మాట్లాడారు. 7.45 గంటలకు మామందూరు విడిది కేంద్రంలో బస చేశారు.

స్థానిక సంస్థల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఏకగ్రీవం



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం ఎమ్మెల్సీగా సిపాయి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారని చిత్తూరు స్థానిక సంస్థల నియోజకవర్గం, రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి నందలి చిత్తూరు స్థానిక సంస్థల నియోజకవర్గానికి ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈనెల 16న నోటిఫికేషన్ విడుదల చేయడమైనది. 23న వైఎస్సార్సీపీ అభ్యర్థిగా సిపాయి సుబ్రమణ్యం నాలుగు సెట్లు నామినేషన్లు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా సి.ధనంజేయులు రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. అభ్యర్థులు నామినేషన్లు ఈనెల 24న పరిశీలించగా అందులో ఇండిపెండెంట్ అభ్యర్థి సి.ధనంజేయులు నామినేషన్లు సాంకేతిక లోపం ఉండడంతో తిరస్కరించబడినందున వైఎస్సార్సీపీ అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవం ఎన్నికైనట్లు ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వుల మేరకు సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లో చిత్తూరు స్థానిక సంస్థల నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు బి.శ్రీధర్, రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ డిక్లరేషన్ ఫారం అందజేశారు.

శ్రీపద్మావతి చిన్న పిల్లల

హృదయాలయానికి అరుదైన రికార్డ్

నెల రోజుల్లో విజయవంతంగా రెండో గుండె మార్పిడి శస్త్ర చికిత్స

13 నెలల పాపకు ప్రాణం పోసిన వైద్య బృందం

అభినందించిన టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : శ్రీపద్మావతి చిన్న పిల్లల హదయాలయం (చిన్న పిల్లల గుండె ఆసుపత్రి) వైద్యులు నెల రోజుల వ్యవధిలో రెండవ గుండె మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి అరుదైన రికార్డు సష్టించారు. పక్కా ప్రణాళికతో గ్రీన్ చానల్ కూడా లేకుండా చెన్నైలో బ్రెయిన్ డెడ్ అయిన రెండు సంవత్సరాల బాలుడి గుండెను సేకరించి తిరుపతికి తీసుకుని వచ్చి 13 నెలల పాపకు ప్రాణం పోశారు. ఈమేరకు ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన 13 నెలల పాపకు గుండె తీవ్రంగా దెబ్బతినింది. తల్లిదండ్రులు ఆ పాపను విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించారు. పాపకు గుండె మార్చాల్సి ఉందని, తిరుపతిలో టీటీడీకి చెందిన శ్రీపద్మావతి చిన్న పిల్లల గుండె ఆసుపత్రికి వెళ్ళాలని డాక్టర్లు సూచించారు. మూడు నెలల క్రితం తల్లిదండ్రులు ఆ పాపను ఆసుపత్రికి తీసుకుని వచ్చి అడ్మిట్ చేశారు. పాపకు సరిపోయే గుండె కోసం వైద్యులు జీవన్ దాన్‌లో రిజిస్టర్ చేశారు. మందులతో పాప ఆరోగ్యం కాపాడుతూ వచ్చారు. చెన్నైలోని ఎంజిఎం ఆసుపత్రిలో రెండేళ్ళ బాబుకు బ్రెయిన్ డెడ్ అయ్యిందని, గుండె దానం చేస్తారనే విషయం ఆదివారం శ్రీపద్మావతి చిన్న పిల్లల ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డికి తెలిసింది. ఎపి జీవన్‌దాన్ సంస్థ, చిన్నపిల్లల గుండె చికిత్సల నిపుణులు డాక్టర్ గణపతి బందాన్ని ఆయన సమన్వయం చేసుకున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మాచర్లలోని పాప తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో రాత్రి 10గంటలకు వారు ఆసుపత్రికి చేరుకున్నారు. రాత్రి 10.30గంటలకు పాపకు అవసరమైన పరీక్షలు, కోవిడ్ పరీక్ష కూడా చేసి గుండె మార్పిడి చేయొచ్చని నిర్ధారించుకున్నారు. టీటీడీ సహకారంతో అంబులెన్స్, మరో ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసుకుని వైద్య బందం రాత్రికే చెన్నై చేరుకుంది. గ్రీన్ చానల్ అవసరం లేకుండా 2గంటల 15నిముషాల్లో గుండెను తిరుపతి ఆసుపత్రికి తీసుకుని వచ్చేలా ఏర్పాట్లు చేసుకున్నారు. నిముషం కూడా ఆలస్యం చేయకుండా తెల్లవారుజామున 3 గంటలకు గుండెను తిరుపతి ఆసుపత్రికి తెచ్చారు. 45 నిముషాల్లో మెడికల్ ప్రొసీజర్స్ పూర్తిచేసి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ గణపతి నేతత్వంలోని వైద్యబందం ఉదయం 4.30 గంటలకు గుండె మార్పిడి శస్త్రచికిత్స ప్రారంభించి ఉదయం 9.30 గంటలకు విజయవంతంగా పూర్తి చేసింది. రూ.30లక్షల ఖర్చయ్యే ఈ శస్త్ర చికిత్స టీటీడీ ప్రాణదానం, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశ్రీ పథకాల కింద పూర్తి ఉచితంగా చేశామని ఈవో తెలిపారు. మరో మూడు నాలుగు రోజులు పాపను ఐసీయూలో ఉంచి తరువాత వార్డుకు మారుస్తారని ధర్మారెడ్డి చెప్పారు. గుండె మార్పిడి శస్త్ర చికిత్సలకు అనుమతి లభించిన నెలరోజుల్లోనే రెండు గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించిన వైద్యబందం దేశంలోనే రికార్డు సష్టించిందని ఈవో అభినందించారు. ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఆసుపత్రి ప్రారంభించిన 15 నెలల్లోనే 1150 మంది చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు చెప్పారు. జేఈవో సదా భార్గవి, బర్డ్ ఆసుపత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి, వైద్య నిపుణులు డాక్టర్ గణపతి, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.

సైనిక్ ఫలితాల్లో 'విశ్వం' ప్రభంజనం



ప్రజాశక్తి-క్యాంపస్: 2023 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయిలో 6, 9 తరగతిలో ప్రవేశం కోసం జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రవేశ పరీక్ష మెరిట్ లిస్ట్ ఫలితాలలో తిరుపతి విశ్వం విద్యార్థులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకుతో పాటు 10 లోపు 7 ర్యాంకులు సాధించి సంచలన ఫలితాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా విశ్వం విద్యా సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.యన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో ఎం.నవదీప్ (9వ తరగతి), ఆవుల వాహిన్‌రెడ్డి(6వ తరగతి) 300 మార్కులకు 281 మార్కులు సాధించి ప్రథమ ర్యాంకు, ఏ.కరణ్, టి.దినేష్ రాష్ట్ర స్థాయలో తృతీయ ర్యాంకులు సాధించారు. కె.పూజిత్, పి.లక్ష్మి నరసింహ సాయి, పి.అజయ్ కుమార్‌లు రాష్ట్ర స్థాయిలో 10 లోపు 7 ర్యాంకులు సాధించారు. 6వ తరగతి ఫలితాల్లో ఎన్.తనీష్, పీ.యశ్వంత్, ఎ.నిషాంత్, ఎ.విష్ణు స్వరూప్,పీ.హేమ సాయి,భగత్ సాయి,గురు చరణ్,కే.హర్షిత్,జై గణేష్, గీతన్విత్ సాగర్,ఎస్.వర్షిణి,నితీష్ రెడ్డి,దేవి శ్రీ,సూర్య, ప్రతిష్ట, హేమంత్ కుమార్,తనుష్,కే.చెంచు శశాంక్, జ్యోతి రావుపూలే తదితరులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించారు. విశ్వం విద్యా సంస్థల విద్యార్థులు సాధించడం మన రాష్ట్ర విద్యాశాఖకే గర్వకారణమని విశ్వం విద్యాసంస్థల అధినేత డా.ఎన్.విశ్వనాథరెడ్డి తెలియజేశారు. అధ్యాపక బందానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు సంస్థ అధినేత కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ యన్.విశ్వచందన్ రెడ్డి, బ్రిలియంట్ స్కూల్ అధినేత జీ.ఓం ప్రకాష్ రెడ్డి, ఆర్.కే. అబాకస్ అధినేత టీ.రామకష్ణ రెడ్డి, రాయలసీమ కోఆర్డినేటర్ ఆర్.రాజేశ్వర రెడ్డి ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు వాహిన్ తలిదండ్రులు లక్ష్మి దేవి, చంద్ర ఓబుల రెడ్డి తదితరులు పాల్గొని విద్యార్థుల్ని అభినందించారు.

ఎస్వీయూలో ఎల్‌ఎల్‌యం స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాలలో 2022-23 విద్యా సంవత్సరానికి ఎల్ ఎల్ యం కోర్సులో చేరదలచిన విద్యార్థులు 2023 మార్చి 2న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ద్వారా స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని ఎస్వీయూ రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏ పి లాసెట్-2022 లో ర్యాంకులు పొందిన విద్యార్థులు పలు విడతల్లో జరిగిన కౌన్సిలింగ్ ద్వారా ఎల్ ఎల్ యం (రెండు సంవత్సరాల కోర్సు)లో ఇప్పటి వరకు సీటు పొందని వారు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని వెల్లడించారు. ఉన్నత విద్యామండలి ఆదేశం ప్రకారం మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని లా సెట్ -2022 లో ర్యాంకు పొందివుంటే మార్చి 2వ తేది 10 గంటలకు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంబంధిత ఒరిజినల్ సర్టిఫికేట్స్ తో హాజరుకావాలని కోరారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన వారికి ఫీజు రియంబర్స్ మెంట్ సౌకర్యం ఉండదని వివరాలకు ఎస్వీయూ వెబ్ సైట్‌ను చూడవచ్చని తెలిపారు.

'భూమనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరాన్ని సాంస్కతిక, ఆధ్యాత్మిక నగరంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తీర్చిదిద్దుతున్నారని..ఎమ్మెల్యేపైఅనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని టిడిపి నాయకులు సప్తగిరి ప్రసాద్‌కి వైసిపి నాయకులు హెచ్చరికలు చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి ఎస్సీ సెల్ స్టేట్ జనరల్ సెక్రటరీ తలారి రాజేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా ఉన్న సమయం నుంచి నేడు ఎమ్మెల్యేగా ఉంటూ శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ ను, దళిత గోవిందం, కళ్యాణ రథం, శ్రీకష్ణదేవరాయల విగ్రహ ఏర్పాటు, తెలుగు భాషా బ్రహ్మోత్సవాలు, ఆర్ సి రోడ్డులోని రైల్వే అండర్ బ్రిడ్జి, ప్రతిష్టాత్మకంగా తిరుపతి నగరానికి పుట్టినరోజును వెలికి తీసి బాహ్య ప్రపంచానికి చాటిన వ్యక్తి అన్నారు. అలాంటి భూమనపై ఎక్కడో పూతలపట్టులో ఉంటూ స్థానికంగా అభివద్ధి చూడలేని వ్యక్తి సప్తగిరి ప్రసాద్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం సబబు కాదని, భూమనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నల్లాన్ని బాబు, నాగయ్య, కష్ణవేణమ్మ, కుమార్, అజయ్, వెంకటరమణ, వంశీ, రాజశేఖర్, మోహన్, శీను పాల్గొన్నారు.

తిరుపతిలో సోము వీర్రాజుకు పరాభవం

వాహనాన్ని అడ్డుకున్న ఆప్ పార్టీ కార్యకర్తలు



ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియపై పెట్టిన తప్పుడు కేసును ఎత్తివేసి, తక్షణమే విడుదల చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ తిరుపతిలోని బిజెపి కార్యాలయం వద్ద సోము వీర్రాజు కాన్వాయిని అడ్డుకొని నిరసన తెలియజేశారు. తిరుపతిలో సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆమ్‌ఆద్మీ పార్టీ తిరుపతి, అన్నమయ్య, కడప జిల్లాల కార్యకర్తలు సంయుక్తంగా శాంతియుతంగా బైరాగిపట్టెడలోని గల బాబూ జగ్జీవన్‌రావు పార్కు నుంచి రాఘవేంద్ర నగర్‌లోని బిజెపి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాపై తప్పుడు మద్యం కేసులు పెట్టి అరెస్ట్ చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం అక్కడ నుండి వెళుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజుకు వినతిపత్రం ఇవ్వడానికి ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు వెళ్ళగా నిరాకరించారు. ఇంతలోనే బిజెపి నేతలు ఆమ్‌ఆద్మీ పార్టీ నేతల పై విరుచుకుపడి ఆప్ నేతల ప్లై కార్డులు, జెండాలు, బ్యానర్లు చించేశారు. దీంతో ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటా చలపతి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు కోడివాక చందు, దస్తగిరి తిరుపతి జిల్లా కన్వీనర్ నీరు గట్టు నగేష్, కడప జిల్లా కన్వీనర్ సాహిద్ హుస్సేన్, అన్నమయ్య జిల్లా కన్వీనర్ తిరుమలరెడ్డి, కడప జిల్లా కోఆర్డినేటర్ రహంతుల్లా మీడియాతో మాట్లాడారు. దేశంలో అవినీతి రహిత పాలన అందిస్తున్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక బిజెపి ప్రభుత్వం కక్షతో ఢిల్లీని రోల్ మోడల్ చేసి ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందుతున్న విద్యా,ఆరోగ్య శాఖల మంత్రులపై అసత్యపు, అన్యాయపు, అక్రమ కేసులు పెట్టి జైలుకి పంపించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనిష్ సిసోడియాను సిబిఐ అరెస్ట్ చేయడం దుర్మార్గపుచర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మనీష్ సిసోడియా పై పెట్టిన తప్పుడు కేసులు కొట్టివేసి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాస్వామికవాదులంతా కలిసి బిజెపి దుచ్చేర్యను ప్రజల్లోకి తీసుకెళ్తామని అన్నారు. ఈకార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ తిరుపతి నియోజకవర్గ కన్వీనర్ టి.జయకుమార్, చంద్రగిరి నియోజకవర్గ కార్యదర్శి ప్రమోద్ కుమార్, సూళ్లూరుపేట నియోజకవర్గ కన్వీనర్ పట్టపు రవి, కడప జిల్లా నాయకులు మహమూద్ గోష్, విద్యార్థి నాయకులు సురేష్ నాయక్, గురురాజ్ పాల్గొన్నారు.

యువత ఎంఎస్‌ఎంఈల వైపు మొగ్గుచూపాలి

ఎస్వీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.రాజారెడ్డి



ప్రజాశక్తి-క్యాంపస్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటు, పెద్ద పరిశ్రమలకు అవసరమైన ఉత్పత్తులను సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో వ్యాపార సంబంధాలు ఏర్పడి కొనుగోలుదారులను, అమ్మకపుదారులను ఒకే వేదికపై తీసుకురావాలనే ఉద్దేశంతో వెండర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం, బయ్యర్, సెల్లర్ ఇంటరాక్షన్ మీట్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు ఎస్.వి యునివర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.రాజారెడ్డి అన్నారు. సోమవారం ఉదయం స్థానిక గెస్ట్ లైన్ డేస్ హోటల్‌లో భారత ప్రభుత్వ ఎం.ఎస్.ఎం.ఈ. డెవలప్మెంట్ అండ్ ఫెసిలిటేషన్ కార్యాలయం విశాఖపట్టణం వారి ఆధ్వర్యంలో 27, 28 తేదీలలో నిర్వహించనున్న ఎగ్జిబిషన్‌ను ఎస్.వి. యూనివర్సిటీ వి.సి. ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎం.ఈ నోడల్ ఏజెన్సీగా సహకారం అందిస్తోందని.. యువత ఎం.ఎస్.ఎం.ఈల వైపు మొగ్గు చూపి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. డెవలప్మెంట్ ఫెసిలిటేషన్ కార్యాలయ ఏడీ జి.వి.ఆర్. నాయుడు మాట్లాడుతూ బ్యాంకర్లు, ఎస్.ఎం.ఈ. లతో బాగస్వామ్యం కోసం దాదాపు 20 మంది స్టాల్స్ ఏర్పాటు విధంగా తమ ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచి అవగాహన, సాంకేతిక పరిజ్ఞానం అందించడం ద్వారా 25 శాతం ఎం.ఎస్.ఎం.ఈ ఉత్పత్తులను ప్రభుత్వరంగ, ప్రైవేటు పరిశ్రమలు కొనుగోలు లక్ష్యంగా ఎం.ఎస్.ఎం.ఈ.ల ప్రోత్సాహం కల్పించడం జరుగుతుందని వివరించారు. తేదీ 28 న ఉదయం 10.30 నుంచి బ్యాంకర్స్ తమ రుణ మంజూరు పథకాలను వివరించనున్నారని తెలిపారు. సమావేశంలో బ్యాంకర్లు, ఎగ్జిబిటర్స్ తమ రుణ సౌకర్యాలను, ఉత్పత్తులను వివరించారు. ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్ ను పరిశీలించారు. దక్షిణ మధ్య రైల్వేస్ మార్కెటింగ్ రామాంజనేయ, జి.ఎం. డి.ఐ.సి ప్రతాప్ రెడ్డి, ఎస్.బి.ఐ. (ఎస్.ఎం.ఈ) ఎ.జి.ఎం మురళీ, ఆర్.ఐ.ఎన్.ఎల్. ఎ.జి.ఎం. ప్రసాద్, నయారా ఎనర్జీ, జడ్.ఎం. రవి శంకర్, పారిశ్రామిక ఔత్సాహికులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

టీటీడీ యాప్‌లో పంచగవ్య ఉత్పత్తుల సమాచారం

ప్రజాశక్తి - క్యాంపస్: టీటీడీ ఆధ్వర్యంలో తయారు చేస్తున్న 15 రకాల పంచగవ్య ఉత్పత్తులపై టీటీడీ వెబ్‌సైట్‌లోనే కాకుండా ఇటీవల రూపొందించిన యాప్‌లో కూడా సమాచారం పొందుపరచాలని ఈవో ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారులకు సులువుగా చేరువ కావచ్చని తెలిపారు. తిరుపతి శ్రీ పద్మావతి అతిథి గహంలో సోమవారం ఆయన అధికారులతో సమీక్ష జరిపారు. 15 రకాల పంచగవ్య ఉత్పత్తుల్లో 10 ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని అధికారులు ఈవో దష్టికి తెచ్చారు. వీటిని మరింత ఎక్కువగా వినియోగదారులకు చేరవేయడానికి ,ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఈవో చెప్పారు. టీటీడీ ఆలయాల్లో వినియోగించిన పుష్పాలతో తయారు చేస్తున్న ఫొటో ఫ్రేమ్‌లను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. వివిధ సైజులు, ఫ్రేమ్ లతో తయారు చేసిన వాటి వెనుక వైపు ఈ ఉత్పత్తి గురించిన పవిత్రత, ప్రాముఖ్యతను అర్థమయ్యేలా ముద్రించాలన్నారు. వీటిపై గణాంక శాఖ అధికారులు సమీక్ష చేయాలని ఈవో సూచించారు. తిరుమల , తిరుపతిలో పరకామణి అంశంపై ఈవో సమీక్ష జరిపారు. నాణాలు వివిధ బ్యాంకులకు క్రమపద్ధతిలో పంపే ఏర్పాటు చేశామన్నారు. బ్యాంకులు ఏ రోజు నాణాలు ఆరోజు తీసుకుని వెళ్లేలా ఉన్న వ్యవస్థను మరింత ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నాణాలు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. జేఈవో సదా భార్గవి, ఎఫ్ ఎ సీఏవో బాలాజి, పరకామణి, అధికారులు పాల్గొన్నారు.

బీజేపీతో మాదిగలు యుద్ధానికి సిద్ధం కావాలి



ప్రజాశక్తి -దొరవారిసత్రం: బీజేపీతో మాదిగలు యుద్ధానికి సిద్ధం కావాలని ఎంఎస్పీ జిల్లా ఇన్‌ఛార్జి గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. సోమవారం సూళ్లూరుపేట శ్రీచెంగాలమ్మ పరమేశ్వరి దేవాలయం నుంచి ప్రారంభమైన మాదిగల సంగ్రామ పాదయాత్ర సోమవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు కావస్తున్నా.. మాదిగలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. సూళ్లూరుపేట నుంచి నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ మీదుగా రాజధాని ముట్టడించే ప్రయత్నం చేస్తామన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనైనా ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని.. లేకుంటే బీజేపీ ప్రభుత్వానికి మాదిగలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మార్చి 15న జరగబోయే రాజధాని ముట్టడిని మాదిగ బిడ్డలు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్, ఎంఎస్పీ సీనియర్ నాయకులు మంద పెంచలయ్య, కో కన్వీనర్ కోలగట్ల రమేష్, గోచిపాతల వెంకటేశ్వర్లు, గోవిందు సురేష్, మండల ఇన్‌ఛార్జి కంటేపల్లి నాగేశ్వరావు, పాండూ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు



ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : దేశంలోనే విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చి ఆదర్శవంతమైన సీఎం జగన్మోహన్‌రెడ్డి నిలిచారనియ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. నగరి నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని పరమేశ్వర మంగళంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యారంగంలో నాడు-నేడు పేరుతో మార్పులు, సరికొత్త విద్యావిధానం, సి.బి.ఎస్.ఈ సిలబస్ తీసుకొచ్చారన్నారు. ఆరు లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నగరి, మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం, పుత్తూరు ఛైర్మన్ ఏ హరి, వైస్ ఛైర్మన్లు జయప్రకాష్, శంకర్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం పీడీఎఫ్ ఎమ్మెల్సీల అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని, ఎమ్మెల్సీ అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, పొక్కిరెడ్డి బాబురెడ్డిలను ఓట్లు వేసి గెలిపించాలని ప్రచారం చేపట్టారు. స్థానిక గాంధీ నగర్‌లోని సచివాలయాలు, ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, ఉపాధ్యాయులను, సిబ్బందిని, అలాగే పాలిటెక్నిక్ కాలేజ్ సిబ్బందిని కరపత్రాలను అందించి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జోగి శివకుమార్, అడపాల ప్రసాద్, బి.వి. రమణయ్య, ఎస్.సురేష్, టి. వెంకటరామిరెడ్డి, బి.చంద్రయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జిల్లా మహాసభలు




ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: చిరువ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం గూడూరు పట్టణంలో ప్రథమ మహాసభలను మార్చి 3 ,4వ తేదీలలో జరుగుతాయని.. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని..ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సర్దార్ శివ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం అంబేద్కర్ సర్కిల్‌లో చిరు వ్యాపారుల జిల్లా ప్రథమ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు . సంఘం అధ్యక్షులు ఎన్ శ్యాంకుమార్, సంఘం నాయకులు శ్రీనివాసులు, సరిత, వీధి విక్రయదారుల పుత్తూరు పట్టణ అధ్యక్షులు నజీర, పుత్తూరు పట్టణ గౌరవ అధ్యక్షులు మహేష్, నాయకులు గోపి ,సెల్వరాజ్ ఆచారి , రవి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



ప్రజాశక్తి- పిచ్చాటూరు: పొద్దుతిరుగుడు సాగులో మేలైన సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని తిరుపతి రాస్ కషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు రైతులకు సూచించారు. సోమవారం ముడియూరు పంచాయతీలో జాతీయ ఆహార భద్రత సంస్థ ఎంపిక చేసిన రైతులకు పొద్దుతిరుగుడు కలుపు పురుగు మందులు ఉచితంగా అందించారు. పంట ప్రదర్శన క్షేత్రాలు పరిశీలించారు. సాగులో ఎదురయ్యే చీడపీడలు, నివారణ చర్యలపై రాస్ కషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి, సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డికి ఓబుళ్‌రెడ్డి కృతజ్ఞతలు



ప్రజాశక్తి-క్యాంపస్: చంద్రగిరి ఎమ్మెల్యే, వైసీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో-ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని వైసీపీ విద్యార్థి సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఓబుళ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తుమ్మలగుంటలోని ఎమ్మెల్యే చెవిరెడ్డి నివాసంలో సోమవారం కలిసి కతజ్ఞతలు తెలిపారు. శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందించి ఎమ్మెల్యే చెవిరెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ఓబుళ్‌రెడ్డి మాట్లాడుతూ తనను వైఎస్ఆర్ విద్యార్థి సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడి నియామకానికి తోడ్పడిన ఎమ్మెల్యేకు, ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి, వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాయి వంశీరెడ్డి, అశోక్ రెడ్డి, మణికంఠ, ప్రశాంత్, సెంథిల్ కుమార్, భాషా, నర్సింహులు, దినేష్, తాహిర్, భార్గవ్, ప్రేమ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

5న బ్రాహ్మణ మహిళా సదస్సు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మహిళా సాధికారతే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమైక్య ఆధ్వర్యంలో మార్చి 5వ తేదీ రాజమండ్రిలోని గోదావరి గట్టనున్న శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మండపంలో బ్రాహ్మణ మహిళా సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రెంటచింతల దీప్తి తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని కులాలకు అన్ని సంక్షేమ ప్రయోజనకర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని, బ్రాహ్మణ కులంలోని మహిళల అభివద్ధిని విస్మరించారన్నారు. బ్రాహ్మణ మహిళలకు ప్రాధాన్యమిచ్చి మహిళా సాధికారత కోసం కషి చేస్తూ రిజర్వేషన్లకై పోరాడుతున్నామన్నారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లోని బ్రాహ్మణ కులస్తులు బ్రాహ్మణ మహిళా సదస్సుకు హాజరవ్వాలని కోరారు. మరిన్ని వివరాలకు 9493634064ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగలక్ష్మి, బ్రాహ్మణ సంఘం నాయకులు సిఆర్కే శేషగిరిరావు, జయలక్ష్మి, పద్మావతి, లక్ష్మీ, చిత్రపు హనుమంతరావు, విశ్వనాథం పాల్గొన్నారు.

రసాయనాల నుంచి కాపాడాలి



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: కంచన పుత్తూరు పంచాయతీలోని సర్వేనెంబర్ 15/1,2,3 లో మామిడి తోటలో వెలసిన దుస్తుల తయారీ పరిశ్రమ నుంచి వచ్చే రసాయనాలో తమ గ్రామాన్ని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. రసాయనాలు, వ్యర్థ పదార్థాలను పంట కాలవలకు మళ్లిస్తుండటంతో పంటలు పాడైపోతున్నాయని వాపోయారు. చెరువుల్లోని చేపలు చనిపోతున్నాయని.. చెరువుల్లోని నీరు తాగితే పశువులు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కంచన పుత్తూరు గ్రామంలోని యువత సర్పంచ్ దృష్టికి తీసుకురావడంతో మండల తహశీల్దారు, పోలీస్ స్టేషన్‌లో కంపెనీని శాశ్వతంగా తొలగించాలని వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కిరణ్, శేఖర్, నరసింహ, గురుప్రసాద్, గురునాథ్, వెంకటరమణ, సోమేష్, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలే లక్ష్యంగా దాడులు

టీడీపీ బీసీ విభాగం నాయకులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకలే లక్ష్యంగా వైసిపి దాడి చేస్తోందనీ టీడీపీ బీసీ విభాగం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఉమేష్ రావు, మిన్నల రవి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న నాలుగు కోట్ల మంది బడుగు బలహీన వర్గాల ప్రజలు జగన్మోహన్ రెడ్డి పాలనలో దయనీయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారి సమస్యలపై పోరాడి వారే లక్ష్యంగా దాడులు చేస్తుండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీఎం జగన్ అసమర్థ పాలనను, స్థానిక ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలను విమర్శించిన కారణంగా రజక బిడ్డ మునిరాజమ్మ దంపతులపై తొట్టంబేడు మండలం శివనాథపురం లోని వారి టిఫిన్ దుకాణం వద్ద కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడులు చేయడాన్ని ప్రభుత్వ దాడులు గానే పరిగణించాలని అన్నారు. రజక సోదరి మునిరాజమ్మ దంపతులపై దాడి చేయడమేగాక, వారి పైనే అక్రమ కేసులు బనాయించిన బిసి ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి అక్రమ పాలనకు వ్యతిరేకంగా ఒక్కొక్క బిసి గొంతుక లక్ష నినాదాలు చేస్తూ ప్రజా పోరాటాలకు నాయకత్వం వహిస్తారని హెచ్చరించారు.

సంక్షేమానికి సారథులుగా వ్యవహరించాలి



ప్రజాశక్తి-డక్కిలి: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. సోషల్ మీడియా వింగ్ అవగాహన కల్పించేలా పనిచేయాలని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ప్రచార జిల్లా అధ్యక్షుడు నెమలపూడి సురేష్ రెడ్డి సలహాలు, సూచనలు తీసుకొని పార్టీ బలోపేతానికి పనిచేయాలన్నారు. సోమవారం డక్కిలిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా వింగ్‌లో పార్టీ బాధ్యతలు చేపట్టిన ప్రతిఒక్కరూ ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కార్యకర్త నడుం బిగించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గంలోని డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, కలువాయి, సైదాపురం, వెంకటగిరి మండలాల సోషల్ మీడియా సభ్యులందరూ పార్టీని ముందుకు తీసుకెళ్లేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కుర్చీకే పరిమితం చేశారు..!




ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతిలో మేయర్‌ను కుర్చీకే పరిమితం చేసి అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని..కార్పొరేటర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, అక్రమాలపై బహిరంగ చర్చకు వస్తారా అని టిడిపి తెలుగు యువత రాష్ట్ర ప్రధార కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్ సవాల్ విసిరారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలు, భూదందాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, నారా లోకేష్ స్థానిక విషయాలపై మాట్లాడితే వనుకు పుట్టిందా అని ప్రశ్నించారు. తిరుపతి కార్పొరేటర్లు నగర పరిధిలోని వార్డుల్లో ప్రజల నుంచి ఎంతెంత వసూళ్లు చేస్తున్నారో నిరూపిస్తామన్నారు. వేసిన కాలువలను తవ్వి మళ్లీ కాలువలు నిర్మిస్తూ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణాలు ప్రజల కోసం కాదని, వైసిపి నాయకుల జేబులు నింపుకోవడానికేనన్నారు. వీటన్నింటిపై బహిరంగ చర్చకు వైసిపి నాయకులు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో మధు, శేషాద్రినాయుడు, శ్రీనివాసులు, రజినీకాంత్, రామ్మోహన్, శరత్ చౌదరి పాల్గొన్నారు.

కార్పొరేటర్లు ప్రజల సమస్యలు తెలుసుకోవాలి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరంలో కార్పొరేటర్లు ఆయా వార్డుల్లో ప్రజల సమస్యలు పట్టించుకుంటున్నారా అని తెలుగు మహిళలు టి.లతారాయల్ ప్రశ్నించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికైన నాటి నుంచి ఆదాయ ఆర్జనే తప్ప ప్రజల సమస్యలు తెలుసుకోలేని వారు కార్పొరేటర్లుగా ఉన్నారన్నారు. తిరుపతి నగరంలో జరుగుతున్న అరాచకాలపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రశ్నిస్తే ఉలిక్కిపడి కార్పొరేటర్లు మూకుమ్మడిగా మాట్లాడారన్నారు. టిడిపి అధికారంలోకి వస్తుందని, అధికారం చేపట్టిన తర్వాత వైసిపి నాయకుల సంగతి తేలుస్తామన్నారు. కార్యక్రమంలో కెఎస్.లత, ఆముదాల మంజుల, రేవతి, తరుణ పాల్గొన్నారు.

రికవరీలపై ప్రత్యేక దృష్టిసారించాలి



ప్రజాశక్తి-బాలాయపల్లి: పొదుపు మహిళలు తీసుకున్న రుణాలపై ప్రత్యేక నిఘా ఉంచి రికవరీలు చేయించాలని ఏరియా కోఆర్డినేటర్ ఆదినారాయణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలకు సంబంధించిన సిబ్బందికి రికవరీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాయపల్లి మండలంలో రికవరీలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. డక్కిలి మండలంలో వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్, ఏసీ కృష్ణయ్య , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-ఓజిలి: ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని చిల్లమాను చేను హరిజనవాడకు సమీపంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించి యంత్రాలతో చదును చేస్తున్నారని అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సోమవారం సర్పంచ్ సాయిరాం, తహశీల్దారు లాజరస్‌కు వినతిపత్రం అందించారు. చిల్లమానుచేను గ్రామానికి చెందిన ఓ నాయకుడు డంపింగ్‌యార్డ్‌కు పక్కనే ఉన్న సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని చదును చేస్తున్నారని.. ఇంటి స్థలాలు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. స్పందించిన తహశీల్దారు ఆక్రమించుకున్న భూముల్లో వెంటనే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

ఆటలతో మానసికోల్లాసం



ప్రజాశక్తి -కోట : పిల్లలకు ఆటలతో మానసికోల్లాసం ఉంటుందని శ్రీప్రగతి విద్యా సంస్థల కరస్పాండెంట్ పసుపులేటి కిషోర్ అన్నారు. సోమవారం శ్రీ ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో గేమ్స్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎగ్జిబిషన్ నిర్వహించి రకరకాల ఆటలకు సంబంధించిన పరికరాలను ఉంచినట్లు విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్ తెలియజేశారు.